నాగహృదయం

రమణశ్రీ

'ఈరోడెవరో దేవ తెలిసిందట. గుడి గట్టిత్తన్నారు బాగ్గెవంతులు.'

ఇటికలతట్ట నెత్తికెత్తుకుంటూ అంది నాగి...

కొత్తగా పనిలోకొచ్చిన దుర్గప్ప నాగికళ్లలో నాట్యమాడే అందాలు చిందరవందరగా చూస్తూ, 'ఏ దేవత? ఎలా యెలిసింది?' అన్నాడు.

'పొలం గోని, దున్నిత్తన్నారంట! యేదో యిగ్గరహం నాగేటికర్రు కడ్డంబడి దుగ్గి సాగనిచ్చింది గాదంట! ఆరేత్రి ఖామందుకల్లో గనబడి గుడి గట్టించ మందంట! నేకపోతే వొంసం నాసమైపోయి, దరిద్రం సుట్టుకొంటాదని, పలుకు సెప్పిందంట...ఆ యిగరహం కాళ్ళసుట్టూ పాములూ, ఆడమనిషిబొమ్మ ఉంది... దాన్నే నాగదేవత, నాగేటిదేవతా అని కొలుపులు దీరుత్తున్నారు'...

నాగికళ్లలో చిన్న ఆవేశం తొణుకులాడింది! భక్తితో అపాదమస్తకం జలదరించింది!

దుర్గప్ప నమ్మలేకండా నవ్వుతూ: 'ఆ ఖామందు సందాలు పోగుసేశాడా! ఏదో యిగ్గరహం దొరికితే దాన్ని బట్టకొని, గుడి గట్టించడమేటి?....డబ్బున్న వాళ్లేసే యెత్తు....'

'సందా ఐదారేలు పోగడినాది...పూనుకొని పని సేయిత్తన్నాడు దర్మప్పెబువు...'

గుడి కడుతోన్న మేస్త్రీల కేకవిని ఉలిక్కి పడ్డారు. కిందకు దింపుకొన్న తట్ట మళ్ళీ నెత్తికెత్తుకొని పరుగెత్తింది.

'యెదవ పెపంచకం! అంతా మోసం!' అంటూ పళ్లు బిగబట్టాడు దుర్గప్ప.

మళ్ళీ నాగి సున్నంకోసం వచ్చింది.

'ఎవర్నైనా మనువు సేసుకొన్నావా?'

'ఇంకా నేదు! తగినోడు తగిలి రావొద్దు?' అంది దుర్గప్ప కండలు దిరిగిన భుజాలమీద చూపులు నిగిడిస్తూ.

దళసరిపాటి ఇనుపరేకుని కొలిమిలో కాల్చి వంపులుదీర్చినట్టున్న వక్షస్సునిండా ఊపిరి పీల్చుకొని 'నీకెవరైనా ఉన్నారా? గుడిసెక్కడున్నాదీ?' అన్నాడు దుర్గప్ప.

'ఎవరూ నేరు. నేనూ ముసిలవ్వా. అంతా కలరావగిలి పోనారు'

సున్నం దీసుకొని, పోతోంది.

పోయిన దిక్కే చూస్తూ. దుర్గప్ప ఏదో మధురబాధ గుండెలో నెమరుకు తెచ్చుకొంటున్నాడు.

నాగిలాంటి పిల్లనే మనువు చేసుకొన్నాడు. బోలెడంత ఓలిపోసి, బాహువుల్లో ఒక్కించుకొని, వయస్సు సార్థకం చేసుకోబోయాడు. నెల్లాళ్ళు కాపరం చెయ్యకండానే, గూడెంలో ఎవడితోనో లేచిపోయింది. అప్పట్నుంచీ వెదుకులాడుతూ ఇక్కడ పనిలోకొచ్చాడు. నాగిని చూసినప్పట్నుంచీ, వెనకటి దానిమాట మర్చిపోవాలనిపిస్తోంది.

నాగి నిచ్చెనెక్కి ఇటికలందిస్తోంది. మేస్త్రీల పరాచికాలకీ సరాగాలకీ సమాధానం చెప్తోంది. దుర్గప్ప దూరంనించి, చూపందుకొన్నాడు. అక్కణ్ణుంచి కాల్జారిపడితే, అమ్మో....ఒక్క ఉదుటన ఎగిరివెళ్ళి చేతులుకాసి, చేతుల్లో ఇరికించుకొని, గుండెలకి హత్తుకొంటే చాలీజీవితానికి!...ఊహల్లో మెరుపులు మెరుస్తూ, మళ్ళీ ప్రత్యక్షమైంది!

తట్ట నేలకేసికొడుతూ నిలబడింది.

'దొంగనాయాళ్లు! నోటికొచ్చినట్టు కూత్తన్నారు. వాళ్ల నోట పురుగులడ...'

మేస్త్రీలని తిట్టి పోసులు పెడుతోంది!

'ఏటి సంగతి?' అన్నాడు దుర్గప్ప మెల్లగా.

'అల్లో.... మేస్త్రీలు ... కొరుకూతలు కూస్తన్నారు.' అంటూ కళ్ళంట నీళ్లు తిప్పుకొంటోంది....

'నువ్వుండించు. నే నెల్తా...' అన్నాడు దుర్గప్ప. దుర్గప్పకేసి జాలిగా చూసింది. కళ్ళలో కరుగుతోన్న కాంతి చెక్కిళ్ళమీదనుంచి జాలువారుతోంది.

దుర్గప్ప గుండెకి ఆ చూపులు ఉప్పెన కలిగించినయ్! అక్కణ్ణుంచి నాగి తట్ట నెత్తికెత్తుతోంటె దుర్గప్పే అందించి వచ్చాడు.

మధ్యాహ్నం వేళ ఇద్దరూ అన్నాలు ఒకేచోట కూర్చుని తిన్నారు. 'ఈడెవరో దేవ తెలిసింపంట.' నాగి మునివాక్కులు జ్ఞాపకంలో గిలగిల్లాడుకుంటున్నయ్! నాగి తన హృదయదేవాలయంలో దేవతె వెలిసినట్టుంది! అంత అందంగా స్వాభావికంగా నవ్వుతూ ప్రేలుతూ తన గుండెలో దేవాలయం కడుతోన్న నాగి.

తట్ట నెత్తికెత్తుతున్నప్పుడు కళ్లలో ఏవో వెదికేది. దిష్టి తగిలేలా వంపులు తిరిగిన శరీరంవైపు చూసేది. ఏదో పారేసుకొన్న దానిలా వెదుకులాలేది. వ్యక్తావ్యక్తంగా నవ్వేది. చిరునవ్వు పెదవుల చివర త్రుంచి పారేసి, ఏదో వేళాకోళమాడేది.

'ఇయ్యాల కూడెవరొండారు?' అంది నాగి.

'నేనే'

పక్కున నవ్వింది.

'గొంతు దిగజారే, జావనాగ సంకటి సేసుకొన్నావే?' అని మేలమాడింది.

దుర్గప్పకి, ఆ నవ్వూ, వేళాకోళం ఏవో అజ్ఞాత సౌందర్యశక్తుల పూర్వాపరాల్ని ఉపదేశించి, బాంధవ్యానికి అఱ్ఱులు చాచాయి. అన్నం తిన్న ముంతలూ గిన్నెలూ రెండూ తనే కడిగి తెచ్చిపెట్టింది. ఆడుతూ పాడుతూ, పని చకచకలాడుతూ పూర్తి చేసేసరికి చీకటి పడబోతోంది.

మేస్త్రీలు రెండు రూపాయల నోటిచ్చి, మార్చుకోమన్నారు. నాగి దుర్గప్ప మొహంకేసి చూసింది.

దుర్గప్ప వెనకాలే నాగి బయల్దేరింది ఊళ్ళోకి! మెలికలు తిరుగుతూ పోతున్న పాములా కాలుదారి ఊళ్లోకి ప్రోవదీస్తోంది. దారికి పదిబారల దూరంలో ఉన్న పుట్టవైపుకి వేలెట్టి చూపిస్తూ అంది నాగి:

'సూశావా? ఆ పుట్టనో బారెడు తాసుపామున్నాది. అదే మా పాములుమావని కాటేసి పొట్టబెట్టుకొంది! అడినించి, ఆ పుట్టంటే బయం నాకు!' —

పుట్టలో ఏదో కదిలినట్టనిపించింది.

బారెడు నాగు...

నాగి నున్నని భుజాలమీంచి కేరుతూ జారుతున్న జడవైపు చూశాడు. బారెడు నాగు.

'ఐతే పాము నెవరూ సంప నేదూ?' అన్నాడు.

'అమ్మో! దేవుణ్ణి సంపడమే!... నాగరాజు... వోంసం నాశమైపోదూ?... ఇల్లంతా పాములు పాములైపోయి, విషం కక్కి కక్కి, పగ తీరుసుకొంటాయి.

ఆ రోజు రేతిరికే, పాములుమావకీ నాకూ పెళ్ళి గావాల... ఊరినించి కావాల్సిన సరుకులూ గుడ్డముక్కలూ కొనుక్కొంచి వస్తన్నాడన్నమాట! సన్నగా సీకటడతంది—పుట్టదరి కొచ్చేసరికి బయం బుట్టిందంట! గుస గుసల్నాగ బుసబుసలినిపించినాయంట! పడగెత్తి పారాడుతూ, కోరాడుతా వస్తంటే కళ్లు బయిర్లుగమ్మినయ్యంట...తరవాత సుహాదప్పి పడిపోనాడు...ఆ దారి నొస్తన్నావోళ్లు ఊళ్లోకి మోసుకొచ్చినారు. ఆకిరికి ఎఱుకయ్య మంత్రంగూడా పని సేసిందిగాదు. ఎన్ని మంత్రతంత్రాలు సేసినా, నాగరాజు కాటుకి బలయిపోనాడు.'

నాగి గొంతులో తడియారి వణికిపోయింది. కళ్ళలో కమ్ముతోన్న చీకట్లు కాటుకతో కరిగి చెక్కిళ్లమీద చారలు కడుతోన్నట్టు అస్పష్టంగా చూశాడు దుర్గప్ప.

'మనువు సేసుకోడానికెవరూ రా నేదా? తరాత'

'నన్ను సేసుకొన్నావోళ్ళని పాము కరుత్తాదని ఉళ్ళోవాళ్లు సెప్పుకుంటుండేవారు. అణ్ణించి ఎవరూ రా నేదు' —

దుర్గప్ప కళ్ళలో ఆశ్చర్యం మెరిసింది.

'మాయమ్మ రోజూ దణ్ణం బెట్టుకొనేదంట, ఈ దారిని పోతా యీ పుట్టకి—అప్పుడికింకా పిల్లలు బుట్టక, దిగులు పడుండేదంట!...పుట్టకు దణ్ణాలెట్టి

న్నాటినించి, ఏదో కొత్తూపిరొచ్చినట్టుందేంటు!... నన్ను గన్నాది తరాత.'

'నాగరాజు వరానబుట్టా వన్నమాట....అందుకే నీపేరు నాగి' అన్నాడు దుర్గప్ప అప్రయత్నంగా...

'అందుకే నాగి పేరెడతి!... నేను కన్ను దెరిసిన చెల్లాళ్ళకి మా యమ్మ కన్నుమూసిందంట!...... ఆణ్ణించి మా మామ్మే సాక్కొచ్చింది...తల్లిని పొట్ట నెట్టుకొన్నావని తిడతా వుంట దిప్పటిగ్గూడా?

'మీ అయ్యెవరో నీకు తెలుసా?' అన్నాడు దుర్గప్ప.

'ఎవరో తెలవదు.' అంటూ సిగ్గుతో తల వంచింది.

'ఓహో! అనుకొన్నట్టూరుకొన్నాడు దుర్గప్ప.

'మీ మామ్మయినా నాగరాజుకి కొలుపులు దీరిసిందా?'

'అమ్మో! కొలుపులే!అంత డబ్బెవనించొస్తది!'

'అందుకే నిన్ను సేసుకోబోయేవాణ్ణే కాటేస్తంది?

నాగి దుర్గప్ప కళ్ళలోకి సూటిగా చూసింది. 'నిజమేనా?' అన్నట్టు.

కిరాణా కొట్టుదగ్గర చిల్లర మార్చుకొన్నారు.

నాగి కావలసిన సామాను కొనుక్కొని వెళ్ళిపోయింది.

దుర్గప్ప నెమ్మదిగా పాడుపడిన గుడిలోకి చేరుకొన్నాడు.

* * * *

చెట్టుకింది పక్షి దుర్గప్ప. నా అనేవాళ్ళు, బంధాలూ బంధువులూ లేని ఒంటరి పక్షి. ఎక్కడికి వెళ్ళినా రెక్కలు గొట్టుకొని బతకాలిసిందే! ఊరూరూ తిరుగుతూ ఈ నాడిక్కడి కొచ్చిపడ్డాడు. దేవతలాంటి నాగి హృదయాన్ని తియ్యని ఊపిరితో పూరిస్తోంది. ఎక్కడో చిక్కని ఆనందానుభూతిని అందిస్తోంది. నాగి వాడిచూపులు ప్రతి క్షణం వెంటాడుతునే వున్నయ్!...

నాగిని తన లోలోపల ఐక్యం చేసుకోనేందుకు ప్రయత్నిస్తూ, నిద్రాదేవి కౌగిలిలో ఒరిగిపోయాడు.

చెట్లు చల్లగా వీవనలు విసురుతున్నయ్. చంద్రుడు వెన్నెల ధారపోస్తున్నాడు. చుక్కలచీరల మేఘకాంతలు చంద్రుడితో దోబూచు లాడుకొంటున్నయ్. మిణుగురులు గుంపులు గుంపులుగా కిందికి దిగివచ్చిన నక్షత్రంపిల్లల్లా ఆడుకొంటూ, సంగీతం పాడుకొంటున్నాయి.

దూరంలో పద్మాకారంలో వెలుస్తోన్న గుడి, వెన్నెల పాలకి తడిసి నానిపోతోంది...దారిలో పెద్ద పుట్ట...బంగారపు పుట్ట...నాగరాజు పడగెత్తి నాగస్వరానికి ముగ్ధమోహనంగా నర్తిస్తుంటే, ఆ పడగపైన నాగి......నాగకన్యలా అపురూపసౌందర్యతరంగాలు పొంగువారుతోన్న సాగరంలాంటి నాగి...

పాము పడగల బుసబుసల మధ్య నాగి...

ఆ నాగిని చేతుల్తో పట్టుకొందామని ప్రయత్నిస్తోన్న తను...అందకుండా ఏ లోకలోకాలకో తేలిపోతోన్న నాగకన్య...సర్పాల పహరాలో సాగిపోతోన్న నాగి...

అడుగులు ముందుకు పడుతున్నయ్!...

పుట్టదగ్గర పడుతోంది...

పడగల బుసబుసలు విసవిసల సరంభం...

నాగినెవరో అందుకు పోతున్నారు...

చేతులు చాచి కాళ్ళిందుకోబోయాడు...... పాదాలు గడగడ వణకసాగినయ్?......త్రాళ్ళతో కట్టివేసినట్టు...కాళ్ళ నిండా నెత్తురు...కొన్ని వేల కాట్లు. విషవహ్నికీలలు... నాగి ఎగిరెగిరి గుడిమీద తేలింది.

పద్మాంచలాలమీద మహోద్వేగంతో నర్తిస్తోంది...పరుగెత్తాడు. కాళ్ళలో సత్తువ తేలిపోతోంది..

నాగి కాలుజారి అతనిచేతిలో మెత్తని మాంసం ముద్దలా, నెత్తురుగడ్డలా పడింది.

గుండెలను హత్తుకొని...

కెవ్వున కేక వేశాడు...

కేకలకి చెట్లమీద పక్షులు రెక్కలారుస్తూ ఎగిరిపోయాయి. కాళ్ళవైపు చూసుకొన్నాడు. ఒక వెచ్చని నిట్టూర్పు ముఖాన్ని మేఘంలా అలుముకొంది!

కలను కన్నాడు.

భయం గుండెల్ని పిండిపారేస్తోంది!

నాగి శక్తిలా కనిపించింది.

నాగిని చేసుకోవడమంటే మాటలా?

అంతశక్తి నీకుందా? అన్న ప్రశ్న వేస్తోందికల..

ఏవో పూర్వాపరాలు స్మృతిపథంలో తేగాయి.

తెల తెల్లగా తెల్లవారింది.

పనిలోకి బయల్దేరాడు. అప్పటి కప్పుడే నాగి పనిలోకి వచ్చి సిద్ధంగా వుంది. నాగిని చూసేసరికి ఏదో కొద్దిపాటి భక్తీ, ఆవేశం కలిగించుకోబోయాడు—

నవ్వుతూ పేలుతూ నాగి పలకరించింది, నిన్నటి చనువు మరింత వృద్ధి చేసుకొంటూ.

'నీతో పలకరిస్తే అపకారమేమో? నాగరా జూరుకొంటాడూ?'

దుర్గప్ప వేళాకోళం చేశాడు.

'ఇంకా నయం! పాముల్ని గానీ నేను సేసుకోబోతన్నానా?' అంటూ మూతి ముద్దుగా ముడుచుకొంది!

'ఊరికనే అన్నాన్లే నాగీ! యేరే బ్రెమెట్టుకోకు'

దుర్గప్ప ఊరడింపుకి కరిగి ప్రవహించింది నాగి. ఈ మనువుకూడా ఆ తాచుపాము మూలంగా చెడిపోతుందేమో అనే భయం లీలగా గుండెచుట్టూ తిరగసాగింది.

నిన్నటిలా చనువు ప్రదర్శించడంలేదు దుర్గప్ప.

విషవాసన తగిలినట్టు దూరదూరంగా తప్పుకుపోతున్నాడు. కలలకీ జీవితానికి సంబంధమేమిటి? అంత పిరికితన మెందుకు తనలో? రకరకాలుగా వ్యతిరేకంగా ఊహించుకొంటూ ఎడమొగం పెడమొగం పెట్టి పనిచేస్తున్నాడు.

మేస్త్రీలు ఎగతాళిచేస్తూ, 'ఒకరోజుకే బెడిసిగొట్టేసిందేటి యెవ్వారం?' అన్నారు దుర్గప్పని!

కాస్తంత ధైర్యం చిక్కించుకొని, 'మూతి ముడుచుకొన్నావేం? నాగీ! నా మీద కోపమా?'- దుర్గప్ప నాగిలో అసహనం పారదోలడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

మొహంమీద ఎరువు చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది. 'నాకేం కోపం! నీ మనసెవరో యిరిసేసినట్టు, ముంగినా మాటాడకపోతే, ఎలాగుంటది సెప్పూ?'

దుర్గప్ప భావతరంగాల్లో ఒడ్డు చేరుకొనే ప్రయత్నంలో వున్నాడు. మధ్యాహ్నం అన్నాలు తినేటప్పుడు తను తెచ్చుకొన్న పచ్చడేదో పెట్టబోయింది. ఆ పచ్చడి చిత్రంగా కనిపించింది. విషవాసన తగిలినట్టు తగిలింది వద్దని వారించాడు. మళ్ళీ కథ మొదటికొచ్చింది.

'సింతకాయ పచ్చడికేం?' అంది మొహం ముడుచుకొని...

'అదేదో తలకాయ సిరగ్గొట్టిన పచ్చడిలా వుంది గాని, సింతకాయపచ్చడినా లేదు...అయ్యేటి పచ్చగా మెరుస్తున్నాయ్?' పచ్చడివైపు చూపిస్తూ అన్నాడు.

పకపక నవ్వింది, 'మిరబగాయ ముక్కలు మెరవడమేంటి?' అంది అమాయికంగా...

దుర్గప్ప కళ్లకి ఎక్కడచూసినా పాముల మెలికలే! పాము కుబుసాలే! బయటికి పొడుచుకొస్తోన్న నాలికలే! ఏ రంగుచూసినా విషంలాగే! ఈ విపరీతానికి భ్రమసిపోయాడు. గుండెదిటవు దేహద్రఢిమా కల తనని భ్రమపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయ్. ఇంతటి వైపరీత్యానికి కారణం నాగికళ్లు! ఆ కళ్లలో ప్రతిఫలిస్తోన్న జ్వాలాతరంగం...నవ్వుతూ పేలుతూ తనచుట్టు వలయాలు తిరుగుతోన్న జ్వాలాతరంగం...

ఐనా భావోన్మాదంతో ప్రవర్తించకండా అటు పోటుకి నిలబడి పనిచేశాడు. నాగిని చూసేసరికి పూర్తి ఏవగింపు కలిగింది.

చిరుచీకటి పడింది!

పని కట్టిపెట్టి బయల్దేరారు.

పుట్టవైపు దారి మానేసి, అడ్డత్రోవ బయల్దేరాడు. నాగికూడా నిశ్శబ్దంగా బయల్దేరింది అతని వెంట. ఉన్నట్టుండి ఆకాశాన మేఘం క్రమ్ముకొంది. చీకటి మరింత చిక్కబడింది!

దారిలో 'దుర్గయ్యమావా!' అంది నాగి. గొంతు పూడిపోయింది.

కళ్లలో ఏదో వెలుతురు దారి చూపుతోంది!...

నేత్రాంచలాల్లో కాంక్ష వ్రేలాడుతోంది భయంగా.

అనునయంగా దుర్గణ్ణి చుట్టబెట్టుకోబోయింది.

పాము తన శరీరాన్ని చుట్టబెట్టుకొన్నట్టు అనుభూతి పొందాడు. చల్లనిగాలి విసిరింది. వచ్చని

ఊర్పులు మొగాన్ని పెదవుల్ని నరనరాల్ని ఉద్రేకిస్తున్నయ్!...రక్తం తరంగమయంగా ప్రవహిస్తోంది ఆపాదమస్తకం...

'నాగీ!'

ఉద్రేకం కేక వేసింది!

జలజల మేఘం వర్షించింది!

నాగి ఉలిక్కిపడింది.

దగ్గర్లో పాడుపడిన గుడి...

గుడిదగ్గరికి చేరుకొనేసరికి గాలివాన...

ఆ గాలిలో వానలో ఏదో రహస్య ప్రణ(శ)య భయంకర సందేశం!

దట్టంగా కమ్మిన మేఘాలు వర్షిస్తున్న ధారలో తడిసిపోయారిద్దరూ...వర్షలోకం లోంచి ఊడిపడ్డ మానవాతీతశక్తుల్లా ఉన్నారు!

'నే నిక్కడే నిదరోతం'—దీపం వెలిగించి, అన్నాడు దుర్గప్ప చలికి వణికిపోతూ.

ఒంటిమీంచి వర్షబిందువులు ముత్యాల్లా తూలి పడుతున్నయ్! నాగి ముఖంమీద ఉంగరాలు తిరిగిన ముంగురులు రింగురింగున ఊగుతూ ముత్యాలు రాలుస్తున్నయ్!...

'పురుగూపుట్రా ఉండే సోట, ఇక్కడేనా నీ నిదర?' అంది.

దుర్గప్ప కళ్లలో అళుకు చూశాడు. కంఠంచుట్టూ తడిసి వానిపోతోన్న అందం, భుజాలకిందుగా బాహువుల్లోకి జారుతోంది!... మైకం కమ్మింది. ఏం చూస్తున్నదీ చేస్తున్నదీ అతని చైతన్యంలో లేదు.

'అపరాధం...పొద్దుణ్ణించీ, నీ కళ్లలో మెదులోన్న పాము మెలిక లేమిటి?'

లోలోపల ఘోష!

వినిపించలేదు అతని చెవులకి! గుడ్డిదీపం ఇద్దర్నీ చూసి రహస్యం దిగమింగుతోంది!

గాలికి రెపరెపలాడిపోయి అస్తమించింది వెలుతురు. నాగి పాములా మెలికలు తిరిగిపోయింది అతనిచుట్టూ పెనుగులాడుతూ. మెరుపు మెరిసింది. మేఘం అరిచింది...ఎక్కడో ప్రణయదేవాలయం వాకిళ్లు తెరుస్తున్న చప్పుళ్లు...

గంటలో విపరీత పరిణామంతో శాంతించింది ప్రకృతి. మెల్లిగా బయటకొచ్చారు...

'దుర్గయ్య మావాఁ'-

హోరున సముద్రం పొంగినట్టు ఏడ్చింది అతని గుండెల్లో తలదాచుకొని...

'ఛా... ఎందుకూ ఏడుపు? నువ్వే నా మనువు. నిన్నే మనువు సేసుకొంటా!' దుర్గప్ప మాటల్లో విశ్వాసం ఏడుపుని అరికట్టింది.

మెల్లిగా చీకట్లో దారి తడుముకొంటూ, తడుముకొంటూ సాగిపోయింది నాగి!...

గుడ్డిదీపం వెలిగింది దుర్గప్ప కళ్లలో.

స్తంభందగ్గర ఏదో చరచర పాకినట్టయింది! త్రుళ్లిపడి చూశాడు. ఏం కనిపించలేదు. వట్టిభ్రమ.

అక్కణ్ణుంచి ఊఁచి అంపాన పెట్టసాగింది మనసు. అంత గుండెదిటవూ నీరుకారిపోయింది. ప్రాణాల్ని ఉగ్గబట్టుకొని ఊపిరి విడిచాడు. ఎంతుగడ్డి మంటబెట్టాడు. చలికి వంకరదీరిన నరాలు సాగాయి. రక్తం రసరస పాకింది. మెదడులో శిలాద్రవం కరిగింది

మంటలో జ్వాలల నాలికలమీద నాగి నృత్యం చేస్తోన్నట్టు కనిపించింది. పాములు మెలికలు తిరుగుతున్నట్టున్నయ్ కీలలు! మంట ప్రక్కనే వెలుగుతూన్నా హృదయంలో వణుకు పోలేదు. భయం పీల్చిపారేసిన పిప్పిలా ఉన్నాడు మనిషి.

నాగితో ఎంత అపచారంచేశాడు? 'దాని ఫలితమే అనుభవిస్తున్నావ్! గుడ్డిదీపం మిణుక్కు మిణుకుమంటూ సాక్ష్యమిస్తోంది! పాడుపడిన గోడలు ఛాయాచిత్రాలు తీసుకొని, తిరిగి ప్రదర్శిస్తున్నట్లనిపించింది! ప్రకృతిలో ఇంత విపరీత పరిణామాలు నమ్మలేకపోయాడు!...

ఏనాడూ కంటనీరు పెట్టనివాడు భయంతో ఏడ్చాడు.

'వెంట నే పారిపో'

లోలోపలి ఘోష!

నాగితో మనువో?

'నీ ప్రాణంకంటె ఎక్కువా? పాము పగబట్టి కాటేస్తే?'

....

పాముకాటుకు నురగలు గక్కుతూ, పొగలు

లేచుతూ చొంగలు కారుస్తోన్న మరణముఖం కనిపించింది!

* * *

'దుర్గయ్య మావా!'

పాడుగుడి ప్రతిధ్వనించింది — 'శిథిలాల యమ్ముల్లో శివుడు లేడోయి' అని — నాగి గొంతు సుడి దిరిగిపోయింది.

అతడు లేడని, ఆక్రోశించి చెపుతోంది వాతావరణం.

'పనిలోకి గానా యెల్లాడేమో!'

కుడిసెగ్గరికి పరుగెత్తింది. 'ఇయ్యాల పనిలేదే నాగీ! దుర్గప్పగానా గనబడితే సెప్పు'

మేస్త్రీ అన్నాడు సున్నంగుట్ట బాగుచేస్తూ.

'ఎవరితోనూ చెప్పడం? మొండిగోడల్తోనా? పాడుపడినగుడిలో విగ్రహంతోనా? ఎవరితోనూ చెప్పడం?...

దుఃఖం గుండెలో దిగదొక్కుకుంటూ పుట్ట దారినిపడి పరిగెత్తింది! ఒక్క ఊపున గుడిసెలో కుక్కినులక మంచంమీద ఎగిరిపడింది.

జారెడు నాగుత్రాచులాంటి జడ పడగవిప్పి బుసగొడుతున్నట్టుంది. విషవహ్ని జ్వాలల్లో పెదవులూ, ముఖం, కళ్లు తేలిపోతున్నట్టున్నయ్!

'ఏటే నాగీ! అంతిపరీతంగా వున్నావ్?' అని ముసలవ్వ సమాధానంకోసం ఎదురుచూసింది!

దుర్గప్ప మనువుసంగతి తడబడుతూ చెప్పేసింది.

'ఇకేం! దగా చేశాడన్నమాట! నీబతుకు సెణంలో కాల్సుకుతిన్నాడు'

ముసలవ్వ మెటికలు విరిచింది.

నాటినించీ, అలా బతుకుతూవచ్చింది నాగి. దిగులుగా, నీరసంగా మసిలింది. ఆదిగుల్లో నీరసంలోనే, నెల అని తేలింది. అంతులేని ఆవేదన... దుర్గప్ప తన కడుపులో చిచ్చుబెట్టి, ఎక్కడికో పారిపొయ్యాడు!...

'ఎక్కడికీ పారిపోలేదు...దుర్గయ్యమావఁ నాకడుపులో సిక్కడిపోనాడు' అనేది ముసలమ్మతో పిచ్చిగా. పిచ్చిపిచ్చి వేషాలేసేది. వాగేది. పాడేది.

'అదుగో! దురగయ్యమావఁ పొట్టలోంచి వత్తన్నాడు. పుట్టమీది కెక్కుతున్నాడు...పడగెప్పిన నాగరాజు, పగబట్టిన నాగరాజు మాటేసి కాటేశాడు'—

తొమ్మిదినెలలూ కంటికిరెప్పలా కాపాడుకొచ్చింది ముసలవ్వ. పదోనెల పైబడుతోంటే, నాగి కడుపు పండి, శిశువును కంది. అప్పుడే కుబుసంవిడిచిన పాములాంటిబిడ్డ... చేతిలో పాములా మెలికలు తిరిగిపోతున్న బిడ్డ...తల్లిపాలు తాగడానికి బుసలు గొడుతున్న బిడ్డ...

పాములా పక్కమీదపాకిపొయ్యేవాడు. పాము చారలు...పడగలా తల!...ముసలవ్వ బిడ్డణ్ణి చూసి మురిసిపోయింది! 'పాములూ' అని పేరుపెట్టింది! పాము చెవులే! ఎక్కడే శబ్దంవిన్నా ఉలిక్కిపడేవాడు. కొడుకుని పొత్తిళ్లలో పొదువుకుని పెంచుకొంటోంది నాగి...దిగులు మరిచిపోయింది. వంట్లో బాలింతరాలి చాయ మెరుగులుదీరింది. 'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్నట్టుంది!

ఊరంతా ఈ 'పాముల్ని' చూడ్డానికొచ్చారు. జాతిమత విచక్షత లేకుండా.

పూర్తిగా పాము కడుపున పుట్టినట్టువాడన్నారు. బుసకొట్టడం విని, గతుక్కుమన్నారు... పాము నాలికలాంటి నాలిక చూచి విస్తుపోయారు... పడగలాంటి తలచూసి ఝడుసుకొన్నారు! నాగిపేరు పత్రికాప్రపంచంలోకి కూడా వెళ్ళిపోయింది. దానితో దిక్కులు మార్మోగినయ్...మనిషికి పాము పోలికల్తో, బుసల్తో బిడ్డపుట్టాడని....

నాటినుంచి, ఆపల్లెటూరు తీర్థమైపోయింది. క్రిక్కిరిసిపోయింది. దారిలో పుట్ట ఆవుపాలతో తడిసి నానిపోయింది. పసుపు కుంకుమల్తో ఎఱ్ఱగా పసుపుల కొండలా దూరానికి కనిపించింది!

'పాములు' బుసవిని, నాలికలుచూచి ప్రపంచం నాగలోకంవైపు భ్రమించిపోయింది!

దూరాన పద్మాకారంలో వెలిసినగుడిలో దేవత, పుట్టవైపు ఈర్ష్యగా చూసింది! పుట్ట నానాటికి పెద్దదైపోతోంది నాగలోకమంతా భూతలంమీద మొలుస్తుందా అన్నట్టు!...ఈ వేడుకలూ, తీర్థప్రజా, ప్రచారం అంతా నెల్లాళ్ళలో పొంగులా అణిగిపోయింది.

ఈ పొంగులోనైనా దుర్గప్ప ఎక్కడైనా తేలి కనిపిస్తాడేమో అని చూసింది. కళ్లు ప్రతిఫలించలేక

పోయాయి. తీరని ఆశమాత్రం మిగిలింది!...ఆఆశతో ఎప్పటికైనా కొడుకుకోసమైనా రాకపోతాడా? అని బతుకుతోంది నాగి!

కాలం గిరగిర తిరిగి యేడాది దాటింది.

'పాములు' పాకిపోతున్నాడు ఎక్కడికైనా సరే!...

ఒకరోజున ఎవరో వింతవ్యక్తి పాముల్ని బయట్నుంచి లోపలికి తీసుకొచ్చి, 'బండికిందబడి సెత్తురె పోవలసింది బిడ్డ...బయటికి రానీ మోకండి' అని నాగి కప్పజెప్పాడు.

జీబురుగెడ్డం... పెద్దబూచి లావున్నాడు...... ముఖం నిండా గాట్లు, మురికీ మాలిన్యం వంటినిండా.... చూడ్డానికి వింత, రోత...కళ్లలో అసహ్యం...

నాగి ఏవగింపుగా చూసింది...ఆబూచి తాలూకు వంటిమీద మాలిన్యం బిడ్డకంటుకొందేమో అని తల్లి తల్లడిల్లిపోయింది.

'ఎవరు బాబూ నువ్వు?'

ఆవిడ కళ్ళలో ప్రశ్న.

'నువ్వు నన్నెరుగుదువనుకొంటున్నావా?

అని తిరిగి ప్రశ్న.

'ఎక్కడో ఏదో అనుబంధం అనుకొంటూ'

విసిగిపోతోన్న ఆకళ్ళు.

'నీకు బాగా జ్ఞాపకమేనా? గుర్తించావా?'

విసివిపోతోన్న ఆకళ్ళ టెపటెపలు భూతకాలాన్ని చప్పుడు చేస్తున్నట్టున్నయ్...

వింతవ్యక్తి బయటికొచ్చేశాడు.

నాగి గుమ్మంలోనించి తొంగి చూసింది.

పాడుగుడివైపు నడకసాగిస్తూన్న వింతవ్యక్తి...

నాగికళ్ళు ఏదో పూర్వాన్ని దృశ్యీకరించుకొంటున్నయ్!

చిరుచీకటి పడుతోన్నప్పుడే నాగికాళ్ళెక్కడికో ప్రయాణం తలపెట్టాయి. ముసలవ్వకి చెప్పకండా, పాముల్ని చంక నేసుకొని బయల్దేరింది.

ఏనాడో చూసినగుడి!...ఎవరో ఉన్న అలికిడి ...అడుగుల సవ్వడికి, లోపల్నుంచి కేక.

'ఎవరూ వస్తి?'

నాగి చప్పుడు చెయ్యకండా లోపలికి తొంగి చూసింది. పాములు కళ్ళు మిటకరించుకొని, నాలిక వెళ్ళబెట్టి చూశాడు. పాముల్ని నేలమీద వదిలింది నాగి. స్తంభం పక్కనుంచి చరచర పాకుతూ, బుస గొడుతూ వెళ్ళాడు.

వింతవ్యక్తి నిజంగా పామనే అనుకోవాలి! 'పాము...పాము...' అని కేకవేశాడు కళ్లు మూసుకొని కిటికీ ఎక్కి కూచున్నాడు.

నాగి కళ్ళముందు కనిపించింది!

'నువ్వా?' అన్నాడు అప్రయత్నంగా.

పాముల్ని చేతిలోకి తీసుకొంది. మెలికలు తిరిగిపోతున్నాడు. భయంతో వణికిపోతున్నాడు.

'పాము...పామనుకొన్నాను'

'పావంటే అంత భయమేం?' అంది నాగి రెట్టించి.

'సిన్నప్పట్నుంచీ భయమే!' అన్నాడు తడబడుతూ.

'సిన్నప్పట్నుంచీనా? మద్దెనించా? నువ్వెవరివో? తెలిసిందా?

నేనెవర్నో నాకు తెలీకండా ఉంటుందా? నిన్న మాత్రం పొద్దుట ప్రాణప్పజెప్పేటప్పుడు చూశాను. నేను అడుక్కొని తిని బతికేవోణ్ణి! నాదగ్గరేవుంది? ఎందుకొచ్చావు ఇక్కడికి?'

'రెండేళ్ళ క్రితం ఇక్కడేం. జరిగిందో జ్ఞాపకం లేదూ నీకు? నిన్ను పసిగట్టే యెంటబడ్డాను. యేసం మారినా గొంతుమారందే! వందమందిలో ఉన్నా నీ గొంతు సిటికెక్కన పసిగడతా! ఈ పాముల్ని సూడు ...ఈడు తండిరిలేని బిడ్డ...దిక్కులేని బిడ్డ...నా మానాన నన్నొదిలేసి, పారిపోనాడు తండ్రి. ఈబిడ్డకోసం బతికాను...నాగరాజు వొరాన పామైపుట్టింది బిడ్డ...ఈణ్ణి సూడ్డానికి పెపంచం ఇరగబడి వచ్చింది. అప్పుడేనా తండిరినని సెప్పుకొంటూ వత్తాడేమో అని సూశాను. ఎవ్వరూ రాందే?...ఈపొద్దు సూశాను... నమ్మలేకపోయ్యాను. మనిసి మారినా సూపు మారదు గందా! గొంతు మారదుగందా!...యెయ్యిమందిలో ఉన్నా ఇట్టే పసిగట్టాల్సిన సూపూ, గొంతూ' నాగి గొంతు పూడిపోయింది.

మొహంలో మాలిన్యం కరుగుతోన్నట్టుంది ఆ వ్యక్తికి. కళ్ళలో ఏదో మెరుపు మెరుస్తోన్నట్టుంది!

అతని మొద్దుబారిన జాలిలేని పెదవులు, పొగ

చూరిన గోడల్లాంటి పెదవులు, గతాన్ని బలవంతంగా చప్పరిస్తున్నట్టున్నయ్!

'నాగీ' అన్నశబ్దం పాడుపడిన దేవాలయం గోడల్ని కూల్చి పారేసింది. రెండేళ్ళక్రితం వేసిన కేక ఇప్పుడు వినిపించినట్టుంది! ఈ రెండు సంవత్సరాల దీర్ఘకాలం గక్కదిలిపోయినట్టయింది! నాటి నుంచి నేటివరకు, 'నాగీ' అన్న దీర్ఘాక్షరాల్ని సాగదీసి అతికినట్టుంది!

'నాగి నా దేవత ఆ దేవతకి ద్రోహం చేశాను—పాముకాటుకి భయపడి'—అన్నాడు ఆచిత్రవ్యక్తి.

నాగికళ్ళలో నీరు గుక్కుకొంటూ నిలిచిపోయింది. నోట్లోంచి, ఆవేశం అంతరించింది ఏనాటి నించీ కాపాడుకొస్తోందో జవసత్త్వం ఒక్క ఉదుటున కూలబడిపోయింది. పాములు వింతవ్యక్తికేసి చూస్తూ, బుసగొడుతున్నాడు.

'ఈడే నీకొడుకు'

'నాకొడుకా' అన్నాడు. ఆశ్చర్యంతో పెనవేసుకొన్నాడు పాముల్ని.

'నిజంగా పామే నే నాగీ! పామంటే ఎంత భయపడేవాణ్ణో, ఆరోజున, పాములు నాకళ్ళలో మెలికలు తిరిగిపోయాయంటే నమ్ము... చివరికి నాభయం భయంనాగ నీకడుపున పడ్డది'

అలా ఎంతసేపు గడిచిపోయిందో, మౌనంగా భావగర్భితంగా, నాగికి అంతుపట్టలేదు!

నాగి లేచి, 'యెల్తాను' అని సెలవు తీసుకొంది.

పాముల్ని ముద్దులాడి యిచ్చేశాడు.

'నేనొచ్చి దిగబెట్టనా?' అన్నాడు.

'వద్దులే! ఎవరేనే సూస్తే బాగోదు' అంటూ దారితీసింది.

ఏదారిన పోతోందో తనకే తెలియలేదు. చుట్టూ నల్లగా మాడిపోయి ప్రవహిస్తున్న చీకటి. భయం గుండెల్ని పిండిపారేస్తోంది. రోజూ నడిచేదారే! ఐతే నేం?...ఏదో అనూహ్యమైన భీతి...గజగజ వణికిపోయింది. పాములు బుసలు గొడుతున్నాడు. అల్లంత దూరంలో చిన్న కొండలాంటి పుట్ట... పుట్టలో ఏదో కదలింది. కొంతివాకలా నెత్తురు జలజల కురుస్తోంది పుట్టమీద. నాగి చేతులెత్తి నమస్కరించింది. పాములు కిందకి జారిపోయాడు. భక్తిలో ఆవేశంలో తూగిపోయింది. పాములింకా చేతిలో నే ఉన్నాడనే భ్రమలో వుంది! పాములు మెల్లగా నల్లగా సాగిపోయ్యాడు ఎక్కడికో ఆవిడాది పసిపాపకే అంతుపట్టదు! చైతన్యంతో చేతుల్లో నడుము దగ్గర చూసుకొంది. ఏంవుంది? శూన్యం...కెవ్వున కేక వేసింది ... ఎలుగెత్తి పిలిచింది. పుట్టలోంచి పాములు మిలమిలతొంగి చూశాయి. జలజల కదిలాయి. పాములా పుట్టలోకి సాగిపోతున్న పాప...ఏదో బారెడు పదార్థం కళ్ళుబైర్లు క్రమ్మిస్తూ,నక్షత్రాల వెలుతురులో, 'పాములు' కాళ్ళని చుట్టుబెట్టుకొని, పెదవుల్ని ముద్దుబెట్టుకొంది—

ఒక్క ఉదుటున నాగి పరిగెత్తుకెళ్ళింది.

'పాములు' బుసకొడుతూ వున్నాడు జోగుతూ వున్నాడు. నురగలు గక్కుతూ పొగలు రేగుతూ యమయాతన కళ్ళలో ప్రతిఫలిస్తున్నాడు. ఆచీకటిలో, గుడ్డివెలుతురులో. 'ఎంతఅన్యాయం?...ఎంతగోరం!...' ప్రకృతి ఘోషించింది నాగి గొంతులోంచి...

'పసిపాపే, నీ ఆకలికి దొరికిందా నాగరాజా! వయస్సులో పొంగులువారుతూ, జలజల రక్తంతో సంగీతంపాడే నరాల్ని విషకలుషితం చేసి. నావక్షస్సు మీద పడి నాట్యమాడలేక పోయ్యావా? నాశరీరాన్ని పెనవేసుకొని, చిత్తమొచ్చిన చోట కాటువేసి ముద్దులాడలేకపోయ్యావా?'...అని...

నాగి చింతచెట్టు కిందకి ఆప్రాణంలేని కట్టెతో చేరుకొంది. తెల్లవారులూ కన్నీళ్లు ప్రవహించింది. చివరికి స్పృహతప్పి పడిపోయింది.

గుడిగంటలు మోగుతున్నయ్!

సొమ్మసిలి పడిపోయిన నాగి గుండెలో ఘంటానినాదం ఏలోకంనించో మేల్కొల్పింది! పరుగు పరుగున ఆనల్లని విషవహ్నికీలాతప్తమైన పాముల్ని చేతిలో ఇరికించుకొని, దేవాలయం ముందు వాలిపోయింది!

పూజారి అడ్డగించాడు.

'ఈగుడి నేనే గట్టాను!... గుళ్లో దేవతని నేనే ముంగు సూశాను. ఇందులో అడుగెట్టడానికి నాకర్హత లేదా? ఇదేం న్యాయం దేవుడా?....నేను గడితే పనికొచ్చిన గుడిలో నన్నడుగెట్టనీరూ?' అని నాగి మెట్లమీద పడి ఆక్రోశించింది.

గుడిలోంచి దుర్గప్ప బయటికొస్తున్నాడు. నాగిని చూసి గతుక్కుమని పోయాడు.

చేతిలో విషంతో మాడిపోయిన నల్లనిపాముల్ని చూసి బిత్తరపోయాడు. 'దురగయ్య మావా' అంటూ నాగి అతని కాళ్లముందు పాముల్ని కన్నీటితో అభిషేకిస్తూ వాలిపోయింది.

గుడిగంటలు ఘణఘణ మోగాయి!